# విరిగిన కెరటాలు

– నూకల సీతారామరావ్

బొంబాయి మెరీన్ డ్రైవ్ బీచ్

ఆ బీచ్ నిర్మానుష్యపు వాతావరణంలో బోసికాళ్ళతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ పైకీ క్రిందకీ ఎగిసిపడుతున్న అలల వంక శూన్యంగా చూస్తూ ఓ యువకుడు 'కాళ్ళకు బొబ్బలు పడ్తున్నాయే' అన్న బాధే తెలియకుండా నడుచుకుంటూ వెళ్ళి ఎదురుగా వున్న ఓ ఇనుప బెంచి మీద కూర్చున్నాడు.

అలా కూర్చుని పైకి చూసేడు. పైన సూర్య భగవానుడు తన తీక్షణతను బహు ప్రభావితంగా ప్రదర్శిస్తున్నాడు.

నుదుటిపై చెమట కారుతూ వచ్చి అతని పెదవులపై నుండి నోట్లోకి చేరుకుంది. అదతను గమనించనే లేదు.

అంత ఎండలో అలా ఒంటరిగా ఆ బెంచిపై కూర్చున్న ఆ యువకుడు బెంచికేసే చూస్తున్నాడు.

'ఇదే బెంచి'– సందేహం లేదు.

గత ఆరేళ్ళుగా ఎన్నోసార్లు తనూ, తన ప్రేయసీ. ఎన్నో సాయంత్రాలు మధురాతి మధురంగా గడిపిన బెంచి.

ఇక్కడే తనూ, సరళా కూర్చుని జీవితంలో ఎన్నో ఆనంద పుటల్ని, ఆహ్లాదంగా చదివేసిన రోజులు.

కాలేజ్‌లో తనకి వక్తృత్వపు పోటీల్లో ప్రథమ బహుమతి వచ్చినప్పుడు తనని "కంగ్రాట్స్" అంటూ పలకరించిన ఆ పంజాబీ షల్వార్ కమీజ్ వేసుకున్న అమ్మాయిని చూసి మొదట తెలుగమ్మాయి అనుకోలేదు. "బొంబాయిలో ఓ తెలుగు వ్యక్తి ఇంత డిస్టింక్షన్ అందుకోవడం నాకెంతో ఆనందం కల్గిస్తోంది" అని స్వచ్ఛమైన తెలుగులో ఆమె అన్నప్పుడు – కట్టూ బొట్టూ ఎలా వున్నా, తెలుగుతనం పూర్తిగా వుట్టిపడ్తున్న ఆమె మాటలు అతనికి మల్లెల మూటల్లా సువాసనలు వెదజల్లేయి.

అలా కలసిన సరళా, తనూ – తమ పరిచయం ప్రేమగా మారిందని తెలిసే సరికే వాళ్ళ కాలేజ్ పరిధులను దాటి ఎన్నోసార్లు ఆ మెరీన్ డ్రైవ్ బీచ్‌లో కలుసుకున్నారు.

అతి సామాన్య కుటుంబంలోంచి వచ్చిన ఆ ఇద్దరికీ ఆ మెరీన్ డ్రైవ్ బీచ్ ఓ స్వర్గధామం. ఆ ఇనుప బెంచియే ఓ పట్టుపాన్పు. మెరీన్ డ్రైవ్‌లోని ఆ షాబాద్ రాళ్ళ ఫుట్‌పాత్‌లే పూల బాటలు.

* * *

మొదటి రెండేళ్ళు వాళ్ళు బీచ్‌లో మాట్లాడుకున్న మొదటి మాటలు వాళ్ళ చదువుల గురించే...

కానీ – మొట్ట మొదటి మాట మాత్రం ఒకరిపై ఒకరికున్న ఘాటైన ప్రేమ భాషలోని ప్రణయ కావ్యంలోనివే.

అయితే, ఆ మొట్ట మొదటి మాట వాళ్ళెపుడూ మూగ భాషలోనే మాట్లాడుకునేవాళ్ళు.

గంటల కొద్ది కూర్చున్నా, కనీసం "బఠాణీలు టైంపాస్ – టైంపాస్" అంటూ అరుస్తున్న కుర్రాడి మీద కనికరమున్నా, జేబులు ఖాళీగా వుండడం మూలాన కొనుక్కునే వాళ్ళు కారు. అయినా 'టైంపాస్' బ్రహ్మాండంగానే జరిగిపోతూ వుండేది. ఒక్కోసారి రాత్రి తొమ్మిదీ, పదీ కూడా అయ్యేది. సరళను హాస్టల్ దగ్గర దింపి, తనూ తన రూంకెళ్ళి ఓ గ్లాసు మంచినీళ్ళు త్రాగేసి, మంచి రోజుల కోసం కలలు కంటూ కమ్మగా నిద్రపోయేవాడు. కడుపులో ప్రేగులు దేవుతున్నా కంటి నిండా కునుకు పట్టేది. దానికి తార్కాణం– "తెల్లారేదాకా ఎన్నో కలలు సరళ గురించి" తెల్లవారు ఝామున, తెల్లారిన తర్వాత కూడా అవే కలలు – 'తనూ, సరళా చెట్టపట్టాలేసుకుని అలా విహార యాత్రలు చేస్తున్నట్టు.

"పగటి కలలు" – నవ్వుకున్నాడతను. శూన్యంలోకి చూస్తూ.

తిరిగి ఆ యువకుడికి ఆలోచనలు...

సరళ తనకి ఆత్మస్థైర్యం కల్గిస్తోన్న రోజులు.

"అదిగో! అటు చూడు – ఆకాశం ఎంత శూన్యంగా వుందో" అని తనంటే–

"శూన్యమేముంది! ఆ ఆకాశంలో కొన్ని కోట్ల కొలది దాగి వున్న నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ కొద్ది క్షణాల్లో కనబడి, మరి కొద్ది క్షణాల్లో మంచి వెలుగుతో తళతళా మెరుస్తాయి. ఆ మబ్బులు ఏ చీకూ – చింతా లేకుండా దూది పింజల్లా ముందుకు పరుగెడ్తూ వుంటాయి. 'తమకి వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేదు' అని చెబుతున్నట్టుగా అంతెందుకు – ఒక్కసారి తలెత్తిపైకి చూడు"

"ఆకాశం కూడా జీవితం లాంటిదే"

"మనం అర్థం చేసుకుంటే జీవితంలో కూడా అంతా ఆనందమే"

ఎలాగంటావా? అందని దాని కోసం అర్రులు చాస్తూ భంగపడేకన్నా, ఎవరి ఆసరా లేకుండా అందుకోబడ్డ ఆనందానికి మించినదేముంది! అందులోని ఆనందాన్ని, తనివితీరా ఆస్వాదించాలంటే దాన్నర్థం చేసుకోగల మనస్సుండాలి. అప్పుడే ప్రశాంతత. అలా కాకుండా తనింకా ఏదో జుర్రుకోవాలి. ఈ జీవితంలోంచి అనుకుంటే – నిరాశా, నిస్పృహ – తప్ప మరేమీ వుండవు.

ఈ జీవితం కూడా ఓ విధంగా చూస్తే గంగానది వంటిది. అక్కడ నీటిలో కలుషితమూ వుంది, నిర్మలత్వమూ వుంది.

స్మశాన వైరాగ్యమూ వుంది.

జీవితం మీద ఆశా వుంది.

గతం అన్న జ్ఞాపకం మనస్సులో చెరగని ముద్రలు వేస్తూవుంటే, భవిష్యత్తు అన్న భావన మనస్సుని ఆరాటపరుస్తూ వుంటుంది.

కొంత మందికి వారణాశిలో గంగమ్మ తల్లి జీవితానికి పరమావధిలా కనబడితే, మరి కొంతమందికి మురికి కాలువలా కనబడ్తుంది.

ఇద్దరికీ అదే గంగానది మరి!

ఒకే గంగ – రెండు దృక్పథాలు ...

అలాగే జీవితం కూడా..."

సరళ చెప్పడం ఆపింది...

"ఎంత ఎదిగి మాట్లాడ్తున్నావు సరళా!" అని తనంటే

"మీకన్నా ఎత్తు ఎదగాలని నాకేనాడూ లేదు..." అంటూ అరమోడ్పు కళ్ళతో తన వంకే చూస్తూ వుండే సరళ జ్ఞాపకాల్తో కళ్ళు మూసుకున్నాడా యువకుడు.



కళ్ళు తెరిస్తే కనుసందుల్లోంచి తన సరళ కనుమరుగై పోతుందేమోనన్నట్లుగా...

* * *

సాయంత్రం ఆరు కావస్తోంది.

సూర్యుడు ఓ పెద్ద నారింజ పండులా కనబడుతున్నాడు పడమరన. కనులు మూసుకుని తల పైకెత్తి పడుకున్న ఆ యువకుడికి తన రెండు కళ్ళలో రెండు పెద్ద అగ్ని గోళాలు కనబడుతున్నాయి. ఆ అగ్ని గోళాల్లో, పుత్తప్తమైన జ్వాలల్లో మాడి మసైపోతున్నట్లుగా వున్నాయి ఆ యువకుడి ఆలోచనలు సరళ గురించి.

తను యూనివర్శిటీ 'ఫస్ట్' వచ్చిన తరుణంలో సరళ కనబడ్డ దృశ్యం కళ్ళ ముందు ప్రత్యక్షమైంది క్షణంలో...

తనూ, సరళా తన కొచ్చిన బంగారు పతకాన్ని చేత్తో పట్టుకుని గడిపిన ఆ వెన్నెల రాత్రి!

ఆ వెన్నెల కాంతిలో సరళ ఒళ్ళో ఆ బంగారు పతకం ధగధగా మెరుస్తుంటే ఆ కాంతిని దిగదుడుపుగా మార్చేసింది సరళ తన సహజ కాంతులతో.

''ఇక ముందంతా మంచే'' అని ఎన్నో వాక్యాల్లో ఎన్నో పర్యాయాలు సరళ తనతో అంటూ వుండేది.

అలాంటి సరళ... అలాంటి సరళ మరిలా ఎందుకైంది?

ఎలా అయింది?

ఎందుకైంది?

ఆ యువకుడు కళ్ళు తెరిచేడు.

చెంపలపై పెరిగిన గడ్డంలోకి కారుతున్న చెమటని చేతిగుడ్డతో తుడుచుకున్నాడు.

ప్రక్కకి చూసేడు ... తిరిగి ఖాళీ బెంచి...

తన జీవితంలాగే...

ఎప్పుడూ అక్కడ కూర్చునే సరళ స్థానం ఖాళీ. ఇప్పుడు ఆ సరళ అదృశ్యమైంది, తన ప్రక్కనున్న స్థానాన్ని శూన్యంగా మార్చేసి...

అతడు సముద్రాన్ని ఎంతో తీక్షణంగా చూస్తున్నాడు. ఆ సముద్రపుటలల్లోంచి ఏవో వాక్యాలు వెలువడుతూంటే తను చదువుతున్నట్లుగా...

తిరిగి ఆలోచనల ముసుర్లు...

తను ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగంలో చేరిన రోజు. మొట్టమొదటి సారిగా ఓ మగవాడిలా ప్రవర్తించిన రోజు సరళతో.

ఇదే బెంచి! ఇలాంటి సాయంత్రమే!!

ఎన్నో తీపి కబుర్లాడుకున్నారా రోజు.

ఎన్ని ఆలోచనలకో రూపు రేఖలు దిద్దుకున్నారా రోజు.

తమదో చిన్న ఇల్లు... చిన్న సంసారం...

ఆ చిన్న సంసారంలో పెద్ద ప్రేమ మందిరం...

ఆ మందిరంలో సరళ అనబడే దేవత...

తనొక పూజారి...

చూస్తుండగానే ఓ పెద్ద అల వచ్చి అక్కడున్న రాళ్ళను ఉధృతంగా తాకితే వచ్చిన తుంపరలు ఆ యువకుని మీదపడి చల్లగా తగిలేయి. అవి అతణ్ణి మళ్ళీ సరళ దగ్గరకు తీసుకెళ్ళేయి.

తను పని చేస్తున్న కంపెనీ కేవలం దొంగ బంగారం, విదేశీ మద్యం దొంగ రవాణా చేసే కంపెనీ అని తెలిసి, రెండు వేల రూపాయిల జీతమున్నా ఆ ఉద్యోగానికి తను రాజీనామా చేసి బయటికొస్తే అదే సాయంత్రం ఇదే బెంచిపై కూర్చున్న సరళ తనతో మాట్లాడిన తీరు గుర్తొచ్చి ఏదో ఇబ్బందిగా ఫీలయ్యేడా యువకుడు.

ఎప్పుడూ జీవితాన్ని ఎంతో ఆశాజనకంగా చూస్తూ వచ్చిన సరళ - తన రాజీనామా గురించి తనిచ్చిన కారణాల్తో రాజీ పడలేక పోయింది.

-''మరింకెన్నాళ్ళు మనికీ బీచ్లో ఒట్టి షికార్లు?''


-''ఇంకెన్నాళ్ళు మన కడుపుల్లో పచ్చి మంచినీళ్ళు?''

-''ఇంకెన్నాళ్ళు మనకి టైంపాస్కైనా బఠాణీలు కొనుక్కోలేని ఆర్థిక అసమర్థత?''

-''ఇంకెన్నాళ్ళు మనం ఆకలికి 'ప్రేమ' అనే కూడు బెట్టి ఆనందించాలి?''

''శరీరమంతా ఎముకల గూడులా తయారై, సంరక్షణే లేకుండా ఆకలి కడుపుల్తో అలమటిస్తూంటే, ఒకరిపై నొకరికి క్రమేపీ తపన తగ్గుతూంటే, ఈ బెంచిపై బ్రతుకు బెంబేలెత్తిస్తూ వుంటే...''

'ఏమిటీ అసమంజసమైన ఆకస్మిక మార్పు నా సరళలో?' జీవితానికో ప్రత్యేకమైన అర్థాన్నిచ్చిన సరళేనా ఇలా మాట్లాడ్తోంది?




'ఒక గోల్డ్ మెడలిస్ట్‌గా దేశ ద్రోహం చేయను' - అని తనంటే, సరళ తనకేదో ద్రోహం చేస్తున్నాననుకోవడం!

... సరళ ఆలోచనలు ఎంతగా మారిపోయాయి.

కళ్ళు తెరిచేడా యువకుడు.

కళ్ళు తెరిచిన ఆ యువకుడికి అంతా అంధకారంగా తోచింది. చూస్తుండగానే సాయంత్రం రాత్రిగా మారింది. సూర్యుడు ''తనలోని వేడిని చల్లార్చుకోడానికా'' అన్నట్లు సముద్రంలో మునిగిపోయేడు.

గత రెండేళ్ళుగా తనిలా ఒంటరిగా బీచ్‌కొచ్చి ఇదే బెంచిపై కూర్చుని సరళ తన జీవితంలోంచి ఎలా నిష్క్రమించిందో ఆలోచిస్తూండేవాడు.

అప్పుడు తట్టిందా యువకునికి... 'కడుపులోని ఆకలికీ - మెదడులో కలిగే ఆలోచనలకీ ప్రేమ ఓ తాత్కాలిక బంధం మాత్రమేనని'

అలా అకస్మాత్తుగా నిష్క్రమించిన సరళని వెదుకుతూ రోజంతా ఆ బొంబాయి పట్టణాన్ని జల్లెడ పడ్తూ, దిన చర్యగా ఆ బెంచిపై కూర్చుని ముందు తిరగనలిపిన వీధుల గురించి, వెనక తరిగిపోయిన జీవితపు పుటల గురించి ఆలోచిస్తూ అలా అలసి సొలసి అదే బెంచిపైన నిద్రపోయేవాడు.

...మళ్ళీ కలలు!!

...అవే కలలు...

పగటి కలలు కావు కాబట్టి అవి కొంచెం ఘాటుగా వుండేవి. తనేదో అథః పాతాళానికీ, ఏదో వూబిలోకి తోసేయబడ్తున్నట్లు కలొస్తే...

'సరళా ... అంటూ అరచి కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా పోలీస్ కానిస్టేబుల్ క్రూరంగా ఝళిపిస్తే లేచి రూంకేసి నడిచి వెళ్ళిపోయేవాడు ఆ యువకుడు.

గోల్డ్ మెడల్ సంపాదించి ఈ వ్యవస్థతో సృష్టించబడ్డ కుళ్ళులో కూరుకుపోతూ... 'ప్రేమ' అనబడే ఓ 'ఇన్‌హిబిషన్'కి అర్థం కనుక్కోలేకపోయానే అనే వృథా ఆలోచనల్తో మథనపడ్తూ...

మరో రెండేళ్ళు గడిపేడా యువకుడు.

పొట్ట పోసుకోవడానికి ఏదో చేస్తూనే వున్నాడు.

జీవితం గడుపుతునే వున్నాడు.

ఇంకా బ్రతికే వున్నాడు. జీవచ్ఛవంలా...

ఇన్ని మార్పుల్లో కూడా అతనిలో రాని మార్పొక్కటే. దినచర్యగా ఈ బెంచిపై కూర్చోవడం, తను పోగొట్టుకున్న వస్తువు ఎలా పోయిందా అన్న ఆలోచనకు అర్థం కనుక్కోవడానికి వృథా ప్రయత్నం చేస్తూండడం.

... ... ...

అబ్బ! అర్థం దొరికింది.

ఎన్నాళ్ళకు......

అయితే, ఆ అర్థం ఎంతో చేదుగా వుంది. బహుశా ప్రేమకు మరో ప్రకరణమదే కావచ్చునన్నట్లుగా.

అంతే!

ఆ రోజు నుండి ఆ యువకుడు తన ఆలోచనా ధోరణి మార్చుకున్నాడు. తనకు తన మాజీ 'ప్రేయసి'

కనబడ్డంతో ప్రక్కన 'భర్త' అనబడే వ్యక్తిలా ఒకతను న్నాడు. అతని చేతిలో ఒక బాబు కూడా వున్నాడు. వారి సాంసారిక జీవిత ప్రతీకగా.

ప్రథమంగా అతనా రోజు కన్నీరు మున్నీరుగా విలపించేడు. తర్వాత తెలుసుకున్నాడు. తను ఎవరికోస మైతే కన్నీరు కారుస్తున్నాడో ఆ వ్యక్తి, జీవితమనే తన పడవకి నావికుడిగా ఇంకెవరినో ఎన్నుకున్నదని.

గుండె నిబ్బర పరచుకోవాలనుకున్నాడు.

అప్పుడే అతనికెవరో చెవులో చెప్తున్నట్లనిపించేయి కొన్ని మాటలు. బాగా పరిచయం వున్న వ్యక్తి అన్న మాటలవి- "అందని వాటి కోసం అర్రులు చాస్తూ కూర్చునే కన్నా". . .

'అందిన ఆనందంతో జీవితానికి ఓ పరిపూర్ణతను సంపాదించుకున్న తన మాజీ ప్రేయసి" అనుకుని నవ్వుకున్నాడు.

జీవితం వూహించుకున్నంత ఆనందంగా ఏమీ వుండదు. ఆలోచనకీ అసలు పరిస్థితికీ ఎంతో వ్యత్యాసం.

మనిషి 'రాబోయే రోజుల్లో సుఖశాంతులున్నాయ్' అన్న ఆశ వున్నంత వరకూ ఎటువంటి కష్టనష్టాలనైనా అవలీలగా ఓర్చుకుంటాడు. అయితే, ఆ సుఖాలు గ్రహీతగా సిద్ధంగా వున్నప్పుడు వాటిని పోగొట్టుకునే పరిస్థితి అంటూ వస్తే - సాధారణంగా ఇట్టే -'కాంప్ర మైజ్' అయిపోతాడు తన ఆశయాలు, వ్యక్తిగత విలు

> అప్పుడే విడివడుతున్న అందమైన పూలవేపు చూస్తున్నట్లు, వయసుతో తొణికిసలాడే అతివల వేపు చూస్తే గానీ కళా కారుడు మానసికంగా యౌవ్వనుడు కాలేడు. వయసుతో కృంగినా మనసు యౌవ్వనంగా వున్నన్నాళ్లు కళాకారుడు అపూర్వంగా సృష్టిస్తూనే వుంటాడు.
>
> — బలివాడ కాంతారావు

వలతో.

సరిగ్గా అలాగే జరిగింది తన సరళ విషయంలో కూడా.

కష్టాల్లో పుట్టింది. కష్టాల్లో పెరిగింది. ఈ కష్టాల నుండి తనకి విముక్తి నా ద్వారానే అని నమ్మకుంది నాలో ఓ ఆశను పెంచుకుంది. నాకుద్యోగం వచ్చే వరకు తోడుగా నీడగా నిల్చింది. ఎప్పుడైతే తను వుద్యోగానికి రాజీనామా చేసేడో - అప్పుడే తన ఆశలు పటాపంచలై పోయేయనుకుంది. త్వరత్వరగా ఓ నిర్ణయం తీసుకుంది.

అంతే!

అందని ఆనందాన్ని పొందడానికి అర్రులు చాస్తూ. వుండొద్దన్న సరళ, అందిన అవకాశాన్ని ఆలింగనం చేసుకోకుండా వుండలేకపోయింది.

ఒక సగటు ఆడదాని ఆలోచనలకీ, ఆచరణకీ వేయబడ్డ బ్రహ్మ ముడి ఇప్పుడర్థమైందా యువకుడికి జీవితానికి పరమావధిగా.

తృప్తిగా నిట్టూర్చేడు.

హాయిగా కళ్ళు చెమర్చేడు.

అలా కళ్ళలోంచి కారిన నీటి బిందువులు చెంపల మీదుగా కారుతూంటే జేబులోని మురికి జేబురుమాలు తీసేడు - చెమర్చిన కళ్ళని తుడుచుకుందామని.

ఖంగుమని పడ్డది జేబులో పదిలంగా దాచుకున్న 'గోల్డ్ మెడల్'

అయితే - ఆ చప్పుడతనికి వినబడలేదు.

ఆ తర్వాత ఆ యువకుడక్కడ కనబడలేదు.

అసలెక్కడా కనబడలేదు.

కానీ మెరీన్ డ్రైవ్ బీచ్‌లో ఆ బెంచి మాత్రం అక్కడే వుంది.

చలనం లేకుండా...

అప్పుడప్పుడూ ఖాళీగా.

మరొకప్పుడు జంటలకి తోడుగా...

ఆశలు పెంచుకుంటున్న ప్రేమికులకి ఆసరాగా...

అటు తర్వాత నిరాశకు నిదర్శనంగా...

శూన్యానికి సమిధగా...


# మీరు 1965కు ముందు పుట్టినట్టయితే ఈ ప్రకటన పూర్తిగా చదవండి

25 సంవత్సరాల వయసు దాటిన ప్రతి 10 మందిలో 9 మందికి జుట్టు రాలిపోతుంది... కాని వారికి ఆ సంగతి తెలియకపోవచ్చు.



**ఆ 9 మందిలో మీరు ఒకరా ? నేడే ఈ పరీక్ష చేసి చూడండి.**

ఒక దువ్వెన తీసుకుని మీ జుట్టుని వేగంగా దువ్వండి. దువ్వెనలోకి ఏదైనా జుట్టు వచ్చినట్టయితే మీ జుట్టు రాలిపోతున్నదన్నమాట.

**ప్యూర్ సిల్విక్రిన్ దీనికి పరిష్కారం**

మీ జుట్టుకి ప్రకృతిసిద్ధమైన పోషక పదార్థాలు అతి కీలకమైన అమినో-యాసిడ్లు: వీటి లోపం వల్లనే జుట్టు పల్చబడుతుంది. ఈ లోపాన్ని సరి చేసేందుకు వైజ్ఞానిక పద్ధతిలో పరిశోధింపబడిన సూత్రాన్ని ఒక్క ప్యూర్ సిల్విక్రిన్ మాత్రమే కలిగి ఉంది. ఇది ఏ విధంగా అంటే:

1. ప్యూర్ సిల్విక్రిన్ మీ జుట్టుకు ప్రకృతి సిద్ధమైన పోషక పదార్థాలైన 17 కీలక అమినో యాసిడ్‌ల అపూర్వ సమ్మేళనం
2. రేడియో ట్రేసింగ్‌ని ఉపయోగించి ఒక ప్రపంచ ప్రఖ్యాత ప్రక్రియ, ప్యూర్ సిల్విక్రిన్ జుట్టు మొదళ్ళను త్వరితంగా చేరుకుని జుట్టుకి లోపించిన సహజ పోషక పదార్థాలను తిరిగి సమకూర్చి, జుట్టుని తిరిగి ఆరోగ్యవంతంగా చేస్తుందని రుజువు పరుస్తోంది.

ఉత్తమ ఫలితాలు లభించేందుకు, మీ జుట్టు ఒత్తుగా తిరిగి మామూలు స్థితికి చేరుకునే వరకు ప్యూర్ సిల్విక్రిన్‌ని రోజుకి రెండు సార్లు మీ తలకు మర్దన చేయండి.







ఇప్పుడే చర్య తీసుకోండి! ప్యూర్ సిల్విక్రిన్‌ని ఈ రోజే వాడి చూడండి!

**ప్యూర్ సిల్విక్రిన్**

O&M/170/Tel M